ఈ వారం కథ

— కె. వరలక్ష్మి

1991
రంజని - నందవాడ భీమారావు
కథల పోటీలో
రూ. 1,116/- బహుమతి
పొందిన కథ

గాజు పళ్లెం

"రెండు బుల్లి చేతులు వింటిని ఎక్కుపెట్టడానికి ప్రయత్నిస్తున్నాయి ఎప్పట్నుంచో. హమ్మయ్య! ఆ చేతుల ప్రయత్నం ఫలించింది. బాణాన్ని వింటికి సంధించి.. లాగి..లాగి.. వదిలేసాయ్, అబ్బా..."!

మూడంకె వేసి ముణగదీసుకు పడుకున్న గంగ కడుపులోని బిడ్డ కదలికకి ఉలిక్కిపడి కలలోంచి మెలకువలో కొచ్చింది. సూదుల్లా గుచ్చుతున్న కంకర గుట్ట మీద భారంగా వెల్లకిలా తిరిగింది. ఎర్రని అగ్నిపూల గుత్తుల మధ్య నుంచి ఎండ నిప్పుకణికల్లా కళ్లల్లోకి దూకింది. చటుక్కున మోచేతిని కళ్ల మీద కప్పుకుంది. ఏదో అనుమానం వచ్చి మోచెయ్యి సందు నుంచి స్టేషను గేటు వైపు చూసింది. గేటు కవతల ఫెన్సింగు కానుకుని పోర్టరు గన్నిగాడు బీడీ తాగుతూ ఆకలి కళ్లతో గంగని తినేసేలా చూస్తున్నాడు.

'చీ ఎదవా' అని తిట్టుకుని అటు తిరిగిపోయింది గంగ. ఆమెకి వాడి చూపులేం కొత్తకాదు. 'ఎప్పుడూ అదే యావ ఎదవ సచ్చినోడికి' అనుకుంది. ఒకట్రెండు సార్లు ప్రయత్నించి ఆమె చేత తలమొయ్యా చివాట్లు తిని కేవలం చూపుల్తోనే తృప్తిపడుతున్నాడు ప్రస్తుతం గన్నిగాడు.

పొద్దుట్నుంచి టీనీళ్లైనా పడని ఖాళీ కడుపులో బిడ్డ ఆకలికి కాబోలు ఉంగలు తిరుగుతోంది. చీర పొత్తిళ్లలో వెయిదూర్చి పొత్తికడుపునోసారి తడుముకుంది గంగ. చేతి మీద చాచి తన్నిన బిడ్డ కాలుని అందుకోవాలని విఫల ప్రయత్నం చేసింది. కొంతసేపు ఇటు పట్టుకోబోతే అటు, అటు పట్టుకోబోతే ఇటు కదులుతున్న బిడ్డతో ఆడింది.

కొంతసేపటికి విసుగొచ్చి ఆట మానేసింది.

సన్నని మంటలాగా ఆకలి మొదలయింది కడుపులో. లేవడానిక్కూడా ఓపిక లేనంత నిస్సత్తువగా వుంది. ఆకల్తోబాటు గంగని పశ్చాత్తాపం కూడా కొంచెం కొంచెంగా తినడానికి సిద్ధమైంది.

అసలా బోడి దాన్తో తగువు పడకుండా ఉండాల్సింది. వాగి వాగీ దాని నోరే నెప్పెట్టి రెండు చేతులా మూసుకునేది. తగువుపడి మాత్రం తను సాధించిందేం వుంది? చెయ్యి వెనక్కి చాచి తల కిందున్న గుడ్డల మూట మధ్యలో పదిలంగా పాత కోకలు చుట్టిపెట్టిన గాజు పళ్లాన్నోసారి తడివి చూసుకుంది.

ఆ బోడిది విసిరిన విసురుకి గాజుపళ్లెం భళ్లుమనేదే, సమయానికి సరిగ్గా తను పట్టుకుమండకపోతే. అప్పటికీ అంచు మీద చిన్న పెచ్చూడిపోయింది. తన ప్రాణం గిలగిలా కొట్టుకుంది. అసలా బోడిదానికి తనని ఆళ్ల కూడా తీసుకెళ్లడం ఇష్టం లేకే ఇంత నాటకమాడింది.

నెమ్మదిగా లేచి చెట్టుకు చేరబడి కూర్చుంది గంగ. ఒళ్లంతా పచ్చి ముద్దలాగుంది. చేతులు ముందుకి చాపి చూసుకుంది. అది గోళ్లతో గీరిన చారలు రక్తాలు పేరుకుపోయినై. దుబ్బులాగున్న తన జుట్టుని చేతికి చుట్టుకుని వంగదీసి వీపు మీద గుద్దిన గుద్దులకి తన ప్రాణం కడెక్కిపోయినట్టైంది. రోగిష్టిదాన్లా ఎప్పుడూ మూలుగుతా వుండే బోడిదాని చేతుల్లో అంత బలం ఎక్కణ్ణుంచొచ్చిందో!

పొద్దున్నే జరిగిన గొడవ గుర్తుకొచ్చిన గంగకి ఏడుపొచ్చింది — బోడమ్మ నలుగురు పిల్లల్నీ అటేద్దర్నీ ఇటేద్దర్నీ వేసుకుని గాఢ నిద్దట్లో ఉన్న గంగ చెవులు హోరెత్తిపోయే కేకలు ఏడుపుల మధ్య తుళ్లిపడి లేచి కూర్చుంది. తూర్పింకా తెల్లబడలేదు. గోదావరి స్టేషన్లోకి ఏదో బండొచ్చి ఆగినట్టుంది, స్టేషనంతా సందడిగా వుంది. గుడిసెల్లోని జనం అటూ ఇటూ పరుగులెడుతూ గిన్నెలూ, తపేలాలూ మూటలు కట్టుకుంటున్నారు. గుడ్డి సూరయ్య తాత తడుంకుని తడుంకుని పొయ్యిలో సగం కాలి ఆరిన కట్టెపుల్లల్ని కాలకుండా మిగిలిన రెండు పుల్లల్తోనూ కలిపి కదుతున్నాడు. అటు పక్క స్టేషన్లోంచీ, ఇటు పక్క కళా కేంద్రం ఆవరణ లోంచీ లైట్లు పట్టపగల్లా వెలుతుర్ని కురిపిస్తున్నాయి. బండి దిగిన జనం బద్ధకంగా స్టేషన్లోంచి బైటకొస్తున్నారు.

ఏం జరుగుతోందో కొంత సేపటివరకూ గంగకి అర్థం కాలేదు.

గుడిసెలపైన ఆచ్ఛాదనగా వేసుకున్న ఆకుల్నీ, గోనె పట్టాల్నీ ఆదరా బాదరా విప్పి పోగులు పెట్టుకుంటున్నారు కొందరు. కుండల్నీ, గిన్నెల్నీ గోనె సంచుల్లో వేసి మూటలు కదుతున్నారు మరికొందరు.

"ఏయే, గుడిసె... నం...! కళ్లం పడతాలేదేటి? రాజాగోరల్లే తొంగున్నావ్. వెగు వెగు. వెగిసి గుడ్డా గుదుసూ అన్నీ మూటలు గట్టు. తెల్లారిందంటే మున్సపాల్టి మొగుళ్లొచ్చేత్తారు. ఇయ్ కూడా దక్కకుండా

కొత్తగా ఓపెన్ చేసిన హోటల్‌కు మొదటి రోజే ఒక్క కష్టమరూ రాకపోయే సరికి దోవన పోయే రామారావును ప్రొప్రైటరు పిలిచి "రండి మాస్టారూ. రూపాయి పావలాకే ఫుల్‌మీల్స్ పెడుతున్నాం" అన్నాడు.

"లేదండి నేను ఆత్మహత్య చేసుకోవటానికి వెళుతున్నాను. ఈసారి వచ్చినప్పుడు తింటా కదా" అంటూ వెళ్ళబోయాడు రామారావు.

"అయితే ఎక్కడికో, వెళ్ళటం దేనికి? ఒక్కసారి భోంచేస్తే పనయి పోతుంది గదా" అన్నాడు హోటల్ ప్రొప్రయిటర్.

– కోగంటి మురళీకృష్ణ, ఒంగోలు

తరివేత్తారు" బోడమ్మ గుడిసెలో పదుకునే అరుస్తోంది.

గంగ చివుక్కున లేచి నిలబడింది. ఆ ఊపుకి ఎడం మక్కె పట్టేసినట్టయింది. అసలే నిద్ర చాలని బద్ధకం. ఒళ్లు మందుకుపోయింది గంగకి.

"గుడిసిలోంచి కాళ్లు సగం బైటికి సాపి గుమ్మాని కడ్డంగా తొంగున్నావు. నేనేటి సేసేది? ముందు నువ్వు వెగిసి బైటికి రా."

మున్సిపాల్టీ వాళ్లు ముందు రోజు సాయంకాలం వచ్చి అందరి పేర్లూ రాసుకుని వెళ్లారు. సారంగధరుడి మెట్ట దగ్గర, క్వారీల పక్కన అందరికీ గుడిసె లేసుకోడానికి స్థలాలిస్తారట. పుష్కరాలకు ఊరిని అందంగా కన్పించేలా చెయ్యాలని మున్సిపాల్టీవారి తాపత్రయం. పట్నం ఒంటి మీది 'గాయాల్లాం'టి మురికి గుంటల్ని ఓ పక్క తాత్కాలికంగా పూడ్చుకొస్తున్నారు. ఆ పైన 'కురుపుల్లాంటి' అక్రమిత పూరిగుడిసెల్ని (ఈ పైత్యం రచయితది కాదు పత్రికా విలేకరులది) సమూలంగా పెకలించెయ్యదల్చుకున్నారు. అలా పెకలించేసేక ఓ చోటంటూ చూపించకపోతే అణిచేసిన సెగ గడ్డల్లాగా మరోచోట అవి తెల్లారేసరికి ప్రత్యక్షమైపోతాయని వారికి అనుభవపూర్వకంగా తెలీడం వలన ప్రత్యామ్నాయంగా ఊరికి దూరంగా గుట్టల మధ్య ఒక్కొక్క కుటుంబానికీ నాలుగడుగుల స్థలాన్ని కేటాయించారు. 'మనిషి చస్తేనే ఆరడుగుల నేల కావాలే, నాలుగడుగుల జాగాలో గుంపులు గుంపులుగా పిల్లాజెల్లల్తో ఎలాగ బతకాల్రా నా కొ..రా' అని ఎవరూ అడగలేదు. అడగరు, ఎందుకంటే పేరుకి ఓ గుడిసంటూ వుంటుందేకాని, వాళ్లల్లో ఎవరూ రోజంతా గుడిసెలో వున్న పాపాన పోరు. ఆడా మగా అంతా కూలీ నాలీ చేసుకోడానికి పోతూ ముసలాళ్లనీ, అంగవైకల్యం వున్నవాళ్లనీ, అయిదేళ్లు దాటని పసివాళ్లనీ ఖాళీ డబ్బాలిచ్చి ఏ రైల్వే స్టేషన్లోనో, ఏ గుడి ముంగిటో, ఏ మసీదు వాకిట్లోనో కూర్చోబెట్టిపోతారు. రాత్రికంతా గుడిసె దగ్గరకి వస్తూ వస్తూ తమ సంపాదనలోంచి దార్లో దొరికిందేదో కొనుక్కు తినేసి కడుపు నింపుకుంటారు. ఏ చేపల పులుసు తినాలనిపించినప్పుడో తప్ప అక్కడి పొయ్యిలు రాజుకోవు.

వయసులో వున్న పెళ్ళికాని మగ కుర్రాళ్ళు ఏ ప్లాట్‌ఫారం మీదో తెల్లారేదాకా ఓ కునుకు తీసేస్తారు. తోడున్న జంటలు మాత్రం కాళ్ళు లోపలికి తీసుకుంటే తలలూ, తలలు ముడుచుకుంటే కాళ్ళూ బైటకొచ్చే ఆ గుడిసెల్లో ముడుచుకుపోయి కాపురాలు చేసేస్తుంటారు. తలుపూ ద్వారంలేని ఆ గుడిసెల్లోంచి తమ కదలికలు అందరికీ బట్టబయలేనన్న విషయం తెలిసి కూడా ఏ దుప్పటి ముసుగులోనో బహిరంగంగా రహస్యాన్ని కాపాడుకుంటూ వుంటారు.

ప్రస్తుతం అక్కడి వాళ్లంతా కొత్త చోటికి చేరబోయే ఉత్సాహంలో వున్నారు. ఇప్పుడెళ్ళబోయే స్థలాన్ని గవుర్మెంటు తమకి నికరంగా పట్టాలు రాసిచ్చేస్తాదని రాత్రే కథలు కథలుగా చెప్పేసుకున్నారు. అంత దూరం నడవలేని ముసలాళ్లు మాత్రం "మీకేం పిచ్చేటల్లా, మనవేం ఆళ్ల సుట్టాలవా బందుగులవా, మనకాడ ఒక్క పైసా ఉచ్చుకోకుండా ఉత్తినే మనకి తలాలు రాసిచ్చెయ్యటానికి? అదీగాకండా పుష్కరాల్లో గోదారమ్మకీ, ఊరికీ దూరంగా పోయి మనం చేసేదేటంట? నాలుగు డబ్బులొచ్చీ ఏళకి ఇయ్యేం పొయ్యాకాలం బుద్దులొచ్చేయిరా మీకు? ఆల్లిచ్చే తలాల్ని నెత్తినెట్టుకుపోతారేటి ఎవులైనా? అయినా మనకి ఏ రోజు కారోజు పొట్టలోకి కూడుండాలగానీ, ఇల్లూ వాకిళ్లూ మనకేం చేసుకుంటాం, ఇయ్యాలిక్కడుంటాం, రేపెక్కడుంటావో ఆ పరమాత్ముడికే ఎరిక. అందుకని ఆళ్లు సూపిచ్చే మోసేతి మీద తేనె సుక్కని నమ్ముకుని అరిచేతిలోది అవతల పారేసుకోకండి. ఓసనుకి ఈ పక్క నించి పొమ్మంటే ఆ పక్కెల్లి గుడిసేసుకోవాల. ఆ పక్క నించి పొమ్మంటే మళ్లీ ఈ పక్క కొచ్చెయ్యాల" అని హితవులు చెప్పేరు.

గేటుకి చేరబడి బీడీ కాల్చుకుంటున్న స్వీపరు ఏసోబు మాత్రం ఆరిపోయిన బీడీ ముక్కని తుపుక్కున ఉమ్మేసి "ఓరి ఎదవల్లారా! రాజమండ్రీకి ఇదేనన్నా ఉత్తుత్తి సోకముకుంతన్నారేటి, పుష్కరాల సోకు. కళ్లు జిగేల్మనిపోవాలని మునిసిపాలాఫీసులో అయ్యగార్లు సెప్పకుంతంటే ఇన్నాను. తెల్లారేతలికల్లా మీరిక్కణ్నుంచి కదలకపోయేరో, ఇంకంతే, మీకు గోని సంచులూ గుడ్డముక్కలూ కూడా దక్కవు. నా మాటినుకోని మంచిగా ఎలిపోండి. పుష్కరాలైపోయిన మర్నాటికెలాగా మీరిక్కడికి రాకా తప్పదు, ఆ బాబులందరూ సూసీ సూణ్ణట్టూరుకోకా తప్పదు" అన్నాడు.

ఆ మాటలకి అందరూ కట్టుబడిపోయేరు.

మురిక్కాలవల్ని జల్లెడ పట్టే మాలచ్మి మాత్రం ఏ వెరగనట్టు ఏసోబు పక్కకెళ్లి నుంచుని బొడ్లోనించి మడతలు పడి మాసిపోయిన రూపాయి కాయితం ఒక

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ వారి
భీమ సిమెంట్

28-2-92 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

దాన్ని తీసి వాడి చెయ్యందుకుని రహస్యంగా వాడి గుప్పిట్లో కుక్కింది. "ఓరేసోబూ, నా కొడకా! పుష్కరాలెల్లిన మర్నాడు తెల్లారీపాలికల్లా నేమా, నా కుర్రోళ్లా ఇక్కడుంటాం. ఈ సోటు మాత్రం ఎవురూ ఆక్కరమించెయ్యకుండా సూసిపెట్టునాయన్నాయనా! సచ్చి నీ కడుపుమడతాను" అని బతిమాలింది.

ఏసోబు కుదరదని కొంచెంసేపు బెట్టుచేసి, మరో రూపాయి చిల్లర డబ్బులుచ్చుకుని 'సరే'నని అభయమిచ్చేడు.

బోడెమ్మ కాళ్ల ముందుకు జరుపుతూ గుడిసెలోంచి బైట పడింది. ఇంకా నిద్రలో వున్న నలుగురు పిల్లల్నీ నాలుగంటించి లేపి కూర్చోబెట్టింది. బోడమ్మ బైటకొచ్చిన కంతలోంచి గంగ లోపలికి దూరింది. ఒక పాత కోక పరిచి వున్న నాలుగు గిన్నెలూ చట్టిలూ సర్దడం మొదలుపెట్టింది. ఈ లోపల బోడమ్మ గుడిసె పైన వేసిన గోనె ముక్కలు రెండూ లాగి పక్కన పడేసి, మూడు వేపులా నిలబెట్టిన తడిక ముక్కల్ని జాగ్రత్తగా పెకలించమని పిల్లలకి పురమాయించింది. పిల్లలు ఆ తడకల్ని గుంజడం మొదలుపెట్టారు. అదిగో అక్కడే అనుకోకుండా గొడవ మొదలైంది.

తడకకి చేరబెట్టిన గాజు పళ్లెం తడక గుంజడంతో ముందుకి పడిపోయింది. పడీ పడ్డమే అంచు మీద అంగుళం మేర పగులిచ్చింది. ఆ గాజు పళ్లెం గంగకి ప్రాణం. తన పుట్టింటి నుంచి తెచ్చుకున్న ఏకైక సామగ్రి అదే. దాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తోంది. ఆ పళ్లానికి అంచు పగిలిపోగానే గంగకి గుండెలో ఎవరో కత్తి దింపినట్లైంది.

ఉక్రోషం పట్టలేక తడక గుంజుతున్న పేరిగాణ్ణి పట్టుకుని వీపు మీద ఫెళ్లుమని ఒక్కటేసింది. అది సూసి బోడమ్మకి ఉడుకెత్తిపోయింది.

"ఓసి నీ సేతులడిపోనూ, రంకు నా సైతీ! నీ కేం పొయ్యేకాలవొచ్చిందే, ఆణ్ణంత దెబ్బ కొట్టేసేవూ" అంది కాళికావతారం ఎత్తేసి.

"కొడతానా సంపేత్తానా ఎదవని. సచ్చినోడు నా గాజుపళ్లేన్ని.."

గంగని మాట పూర్తిచెయ్యనీకుండా బోడమ్మ అందుకుంది "ఓలబ్బో గాజు పత్రెం. అమ్మగారింటి కాణ్నుంచి అట్టుకొచ్చేసింది అరణం. నాకు మండుకొచ్చిందంటే నేలకేసి కొట్టేసి నాలుగు పెక్కలు సేసి గల్ను జాగర్త" గాజు పళ్లాన్ని గంగ మీదికి విసిరేసింది బోడమ్మ.

"ఏదీ, సెయ్ నంజా, నాలుక్కాదు రెండు ముక్కలు సెయ్ సూద్దాం. నీ బుర్ర కూడా రొండు సెక్కలైపోద్ది దెబ్బకి" ఆ పక్కనే పడున్న కట్టె పేదు నోదాన్ని చేతిలోకి తీసుకుంది గంగ.

గంగ చేతిలో కట్టెపేదు చూడగానే బోడమ్మ వీధెగిరిపోయేటట్టు రాగం లంకించుకుంది "ఓలమ్మో లమ్మో! ఈ దొంగలం.. ఈ దొమ్మరి సాని, నా మొగుణ్ణి వల్లో ఏసుకుని నా కాపరంలో నిప్పులేసింది, నా మొగుణ్ణి పొట్టనెట్టేసుకుంది గాకుండా ఇంక నన్ను నంపెయ్యడానికి తయారైందిరో బాబో" కూర్చుని నెత్తిన రెండు చేతులూ పెట్టుకుని రాగాల్తీసి రాగాల్తీసి

"హలో! ఆఫీసరు గారేనా మాట్లాడేది? మీ ఆఫీసులో క్లర్కు రామారావుకు పెద్ద ఏక్సిడెంటు జరిగింది. పది రోజులు ఆఫీసుకు రావటానికి వీలుపడదు. ప్రస్తుతం ఎమర్జన్సీ వార్డులో వున్నాడు"

"ఎవరు మాట్లాడేది?"

"రామారావు ఇంటి ప్రక్కతన్ని పేరు నాగేశ్వరరావుండి.

"అహ! అలాగా! మీ ఫోనులో క్రికెట్ కామెంటరీ వినపడుతోంది. ఇప్పుడు ఇండియా స్కోరెంత?" అడిగాడు ఆఫీసరు నాగేశ్వరరావును.

"ఒక్క నిమిషం. ఈ క్రికెట్టు నాకు తెలిసి చావదు. అరేయ్ రామారావు ఇండియా స్కోరెంత?" అంటూ అడిగాడు.

అంతే రామారావు ఇక ఆఫీసుకెళ్ళాల్సిన అవసరం లేకపోయింది.

– కోగంటి మురళీకృష్ణ, ఒంగోలు.

మొగుణ్ణి తల్చుకుని ఏడుపు మొదలుపెట్టింది. అది చూసి బిత్తరపోయిన గంగ కట్టెని కిందపడేసింది.

కట్టెనైతే పడేసింది కానీ, పొంగుకొస్తున్న ఉక్రోషాన్ని ఆపుకోలేకపోయింది.

"పోపోయే రోగిష్టి నంజా! నువ్వు పనికి రాని డొక్కు నంజవనే కదా ఆడు నన్ను తెచ్చుకున్నాడు" అంది బోడమ్మని ఎక్కడ కొట్టాలో అక్కడ కొట్టేనని మురిసిపోతూ. ఆమె మురిసెం ఎంతోసేపు నిలవలేదు. బోడమ్మ దెబ్బ తిన్న పులిలాగ క్షణంలో ఎగిరి దూకి గంగ జుట్టు పట్టేసుకుంది. ఆ జుట్టును చేతికి మెలిపెట్టుకుని వంచి, వీపు మీద గుభీ గుభీమని గుద్దింది. కాని ఆమె కెంతసేపూ రెండు చేతులూ అడ్డం పెట్టుకుని తన గర్భం మీద దెబ్బ పడకుండా కాపాడుకోడానికే సరిపోయింది. కొట్టి కొట్టి బోడమ్మా, దెబ్బలు తిని తిని గంగా సొమ్మసిల్లిపోయేరు.

తెల్లారి ఆరు గంటల వేళకంతా అందరూ మూటల్తో సిద్ధమైపోయేరు.

ఎలాగో ఓపిక చేసుకుని గంగ కూడా తన గుడ్డల్లో గాజుపళ్లెం జాగ్రత్తగా పెట్టి మూట కట్టుకుంది.

ఆనెం కళా కేంద్రం గోడ పొడవునా గుడిసెలు పీకేసిన ఆనవాలు తప్ప మరేం మిగల్లేదు.

కేన్‌తో టీ అమ్ముకునే కుర్రాడొస్తే అందరూ టీ నీళ్లు కడుపులో పోసుకున్నారు. తనూ టీ తాగుదామని గంగ మొల్లో వెతుక్కుంటే బొడ్లో దోపుకున్న అర్ధ రూపాయి బిళ్ల కనపళ్లేదు. చెట్టు వెనక్కెళ్లి గబగబా చీర కుచ్చిళ్లన్నీ పీకేసి చూసుకుంది. ఊహు. ఇందాకటి కొట్లాటలో ఎక్కడో పడిపోయినట్టుంది. ఆశ చావక

చాలాసేపు వెతుక్కుంది గంగ. దొరకలేదు. పోనీ ఎవరైనా 'ఈ టీ నీల్లు తాగు' అంటారేమోనని చూసింది. ఎవరూ అనలేదు. టీ కుర్రోడు అరువివ్వనన్నాడు. "ఇక్కణ్నించి ఎల్లిపోతన్నారు కదా" అన్నాడు. ఆ మాట విని బోడమ్మ గయ్యిమని లేచింది మళ్లీ.

"అదెక్కడి కొత్తాది నా సవితి? దాని కెపుడూ బొట్టెట్టి బూములియ్యలేదు. నా మొగుడికి నేను నీతైన పెళ్లాన్ని కాబట్టి గవుర్మెంటోడు నాకూ, నా బిడ్డలకీ ఇచ్చేడు. ఇలాంటి అడ్డమైన గుంట ముండలకి ఇచ్చెయ్యటానికి ఆడేం తెలివిలేనోడు కాడు."

"నీ టీ నీల్లు తాగాపోతే నేనేం సచ్చిపోన్లే, ఎల్లెల్లు" అని అనవసరంగా టీ కుర్రాణ్ణి కసురుకుని అటు తిరిగి కూర్చుంది గంగ.

ఏడు గంటల కంతా మున్సిపాల్టీవాళ్ల మనిషొచ్చి అందరూ ఎక్కడికెళ్లాలో చెప్పేసిపోయాడు. వరసగా పేర్లు చదివేటప్పుడు ఆ లిస్టులో బోడమ్మ పేరుంది కాని, గంగ పేరు లేదు.

నాలుగైదు రోజుల క్రితం అందరూ పేర్లిస్తా వుంటే బోడమ్మా, పిల్లలూ ఎక్కడుంటే తనూ అక్కడే కదా అనే ధీమాతో గంగ తన పేరివ్వలేదు.

"ఆ , ఇయ్యన్నీ మామూలే, ఇలాంటి గొడవలు ఎన్నిసార్లు జరగలేదు! ఈ బోడిదాని కసలే ఒళ్లొంగదు. నేను లేకపోతే దీనికి తిండి పెట్టేవోళ్లెవరు?" అనుకుంది ధీమాగా.

నెల రోజుల క్రితం అతిసారం వచ్చి రాజయ్య పోయినప్పట్నుంచీ గంగే ఆ కుటుంబానికి మొగదిక్కులా నిలబడింది. నలుగురు పిల్లల్నీ వెంటేసుకుని బజార్లోకి పోయి పచారీ దుకాణాలకి మూటలూ, గంపలూ మోసి రోజుకి అయిదార్రూపాయలు సంపాదించుకొస్తోంది. మాకలు కొనుక్కొచ్చి, ఏవేళైనా పొయ్యి రాజేసి గంగ వండిపొయ్యాల్సిందే, బోడమ్మ మాత్రం ముణగదీసుకు పడుకుని కదలదు. ఇక్కడి పూచికపుల్ల తీసి అక్కడ పెట్టదు. 'ఏ నం'టే రోగం అంటుంది. 'వేళకి లేచి గిన్నెడన్నం ముప్పొద్దులా తినే దానికి ఏం మాయరోగవో' అనుకుంటుంది గంగ. బెటు చేస్తూ అటు తిరిగి కూర్చున్న గంగ నొదిలేసి వెళ్లిపోయేరంతా. ఆశ చావని గంగ వాళ్లు కనుమరుగయ్యే వరకూ చూస్తూనే వుంది. తను పెంచిన ఆఖరోడైనా వెనక్కొచ్చి "చిన్నమ్మా, నువ్ రాయే" అంటాడేమోనని. అలా జరగలేదు. అప్పుడు పొంగుకొచ్చేయి గంగకి గోదావరన్ని కన్నీళ్లు. ఒక్కసారిగా ఆకాశంలో మబ్బులు కమ్ముకొచ్చేయి. సన్నగా చినుకులు ప్రారంభమయ్యేయి.

భారంగా లేచి, మూట చంకనేసుకుని ఒక్క నిమిషం ఆలోచించింది గంగ అటు స్టేషన్లోకి పోదామా, ఇటు కళా కేంద్రం ఆవరణలోకి పోదామా అని. తను మంచున్న గోడ వెనకే వున్న కళా కేంద్రమే దగ్గరగా తోచింది. అదీగాక స్టేషన్లో గన్నిగాడి పోరొకటి.

చుట్టు తిరిగి గేట్లోంచి తిరిగొచ్చి కళా కేంద్రం మెట్లన్నీ ఎక్కేసరికి ఆలుపొచ్చింది గంగకి. ఆయాసపడుతూ స్తంభానికి చేరబడి కూర్చుండిపోయింది. మొట్టమొదటిసారి రాజమండ్రి రావడం గుర్తుకొచ్చింది.

చిల్లు గిన్నెలకి మాట్లెయ్యడానికి తను ఊరొచ్చిన

నలభై ఏళ్ల రాజయ్య నెల్లాళ్లపాటు తమ గుడిసెలోనే వున్నాడు. చుట్టూ అడివి, కొండలూ. రోజూ కొంత కొండ మేరకి కొండల్ని పగలగొడుతూ రాళ్లు కొట్టే జనం. ఆ గుడిసెల్లో వుండే జనాలకి కాస్త గంజి కాచుకుని తాగడం, మళ్లీ రాళ్లు కొట్టే పన్లో మునిగి పోవడం తప్ప మరో వ్యాపకం వుండేది కాదు.

ఊహ తెలిసినప్పట్నుంచీ అదే ప్రపంచంగా పదహారేళ్ళు ఒంటిమీదికి తెచ్చుకున్న గంగకి రాత్రి తన తండ్రితోబాటు కల్లు ముంత ఖాళీ చేసి చిలవలు పలవలుగా రాజయ్య చెప్పే రాజమండ్రి కబుర్లు కడుపు నింపేసేవి.

గోదావరి ఒడ్డునే గుళ్లూ గోపురాలూ, గోదావరి మీద బ్రిడ్జీలూ, కడతా కడతా వున్న మూడో బ్రిడ్జి స్తంభాలూ, సినిమా హాళ్ళూ, కాపీ ఓటేళ్లూ ఒకటేంటి రాజమండ్రి అంటే స్వర్గం అన్పించేది గంగకి. నెల గడిచేసరికి కల్లు ముంతల స్నేహం ముదిరి, పదహారేళ్ళ గంగని తనకి కట్టబెట్టమని రాజయ్య అడిగిన వెంటనే తల ఊపేసేడు గంగ తండ్రి. గంగ తల్లి గంగని చాటుకి పిల్చి చివాట్లేసింది. "అడి వయసెక్కడ, నీ వయసెక్కడ? నీ బాబంత వయసోడాడు. ఆణ్ణి కటుకుని మవ్వేం సుకపడతావే పిచ్చిమొకవా, ఆణ్ణి సేసుకోనని సెప్పు"

కాని, గంగకి తల్లి మాటలు చెవికెక్కలేదు, ముందా రాళ్ళ ప్రపంచం నించి బైటపడితే చాలనుకుంది. ఈ ఛాన్స్ వదిలేసుకుంటే అక్కడే రాళ్లుకొట్టే ఏ కుర్రాడికో తనని కట్టబెట్టేస్తారు. మరో ప్రపంచం అనేది చూడకుండానే ఈ రాళ్ల మధ్యనే తన బతుకు తెల్లమారి పోతాది. రాజయ్య చేత మెళ్లో పసుపు కొమ్ము కట్టించుకుని అడి వెంట వచ్చేసింది. కాణీ కట్నం అడగలేదు సరికదా, అత్తగారికో జనతా చీర, మావగారికో జనతా పంచె కొని పెట్టిన రాజయ్య దేవుళ్లాగ కనిపించేడు వాళ్లకి. ఆ రాత్రి కల్లు ముంతల పార్టీ చేసాక అక్కడున్నోళ్లందరికీ దేవుళ్లాగే కనిపించేడు. పుట్టింటివాళ్లు గంగకి ఒక కొత్త కోకైనా కొనలేకపోయేరు.

రాళ్లు కొట్టిన డబ్బులు దాచుకుని అటుగా వచ్చిన కావిడి సామాన్ల వాడి దగ్గర చిన్నప్పుడెప్పుడో ముచ్చట పడి కొనుక్కున్న, బాతులూ లతలూ ముద్రించి వున్న అన్నం కంచమంత గాజు పళ్లాన్ని మాత్రం గంగ పదిలంగా తన వెంట తెచ్చుకుంది. మొదటిసారిగా రైలు బండెక్కించిన రాజయ్య గంగ కళ్లకి అడు చెప్పిన సినిమా కథల్లోని హీరోలా కన్పించేడు.

ఇప్పట్లాగే ఆ రోజు సన్నటి చినుకులు పడుతున్నాయ్. గోదావరి స్టేషన్లో దిగి ఏదో ప్రపంచంలో తేలిపోతూ గాలిలో నడిచొచ్చిన గంగకి నేల మీద బోర్లా పడిపోడానికి ఎంతోసేపు పట్టలేదు.

గుడిసె గుమ్మం దగ్గరే ఎంగిలి గిన్నెలు కడుక్కుంటున్న బోడమ్మ రాజయ్యని చూస్తూనే తిట్లకి లంకించుకుంది. "ఇన్నాళ్లూ ఎక్కడికి పోయా? ఎదవ సచ్చినోడా, ఇక్కడ తిండీ నీళ్లూ లేకుండా మేం సచ్చినా నీకేం పరవాలేదన్న మాట!" అంటూ.

"ఇదెవత్తీ నీ ఎనకాల? మెళ్లో కొత్త పసుపుతాడుంది. అమ్మో అమ్మో, నా గొంతుక్కోసేసేడల్లో. ఈ ఆడంగిరేకులెదవ ఇంకెవత్తో రంగసాన్ని ఎంటబెట్టుకొచ్చీసేడల్లో" అంటూ గుడిసె లెగిరిపోయేటట్టు రాగాలెట్టింది. "ఆడికి సిగ్గు లేకపోతే నీకూ నేదంటే? ఆడి వయసెక్కడ, నీ వయసెక్కడ?" అంటూ గంగని బుగ్గల్లో పొడిచింది. అప్పుడర్థమైంది గంగకి రాజయ్యకిది వరకే పెళ్ళాం పిల్లలూ వున్నారనీ, రాజయ్య హీరో కాదనీ, పెళ్ళాం ముందు పిల్లి అనీ. ఏం చెయ్యాలో తోచని గంగ కొంగు బొడ్లో దోపుకుని బోడమ్మ చేతిలోని ఎంగిలి గిన్నెలందుకుంది. కాస్సేపట్లోనే గుడిసెంతా అలికి ముగ్గులేసి అద్దంలా తయారుచేసింది. సాయంకాలం పెద్ద పిల్లలు ముగ్గురికీ స్టేషను కుళాయి దగ్గిర రుద్ది రుద్ది స్నానాలు చేయించింది. చిరుగుల లాగూలకి కుట్లు వేసి తొడిగింది. చంటోడికి తాటాకుల మంట మీద వేణ్ణీళ్ళు మరిగించి నీళ్లు పోసి, శుభ్రమైన పాత గుడ్డల్లో పడుకోబెట్టింది. వంటంతా కానిచ్చి, అలిగి పడుకున్న బోడమ్మకి పాదాలు ఒత్తింది.

ఇన్ని చేసినా, వారం రోజులకి గాని బోడమ్మ కోపం చల్లార లేదు.

ఆ తర్వాత బోడమ్మ మహారాణీ, గంగ దాసీ పిల్లా అయ్యారు.

రాజయ్యకి బోడమ్మ ఎదుట నోరెత్తే ధైర్యమే కాదు, కన్నెత్తే ధైర్యం కూడా లేదు.

ఎప్పుడైనా బోడమ్మ ఏ సినిమా కెళ్ళినప్పుడో తప్ప రాజయ్య గంగని తాకే వాడు కూడా కాదు. ఒకట్రెండు సార్లు గోదావరవతల ఊళ్లకి మాల్లెయ్యడానికి వెళ్తూ వండి పెట్టడానికి గంగని తన కూడా పంపమని రాజయ్య బోడమ్మని అడిగేడు. ఒంటికాలి మీద లేచిన బోడమ్మ నోటికి ఝడిసి ఆ తర్వాత ఆ ఊసెత్తడం మానేసేడు.

గంగకి మాత్రం ఆ చుట్టు గుడిసె స్వర్గంగామా, గోదారి నీళ్లు అమృతంగామా అన్పించేవి. పనంతా చేసేసి, బజార్లో రెండ్రూపాయలు చేతిలో పడగానే మేట్నీ సినిమా కెళ్ళిపోయేది. చిరంజీవి ఆమె కలల రాజకుమారుడు. కళా కేంద్రంలో తరచుగా జరిగే కార్యక్రమాల్లో ఏ నాట్యమో, నాటకమో వుంటే సీనా రేకుడబ్బా మీది కెక్కి గోడ మీది నుంచి, బోడమ్మ తిట్టేవరకూ చూస్తూనే వుండేది. గంగకి బతుకులో కష్టం అనే పదాని కర్థం తెలీదు. ఆమె కళ్లకి లోకం ఎప్పుడూ రంగుల్లోనే కన్పిస్తూ వుండేది.

రాజయ్య వెంట వచ్చిన నాలుగేళ్లకి నెల తప్పిందని తెల్సినపుడు సంతోషించిన వాళ్లెవ్వరూ లేకపోయారు. చిత్రంగా గంగకి ఇన్నాళ్లకి తల్లి గుర్తుకొచ్చింది. ఏమైనా సరే తల్లి కాబోయే వేళకి తన తల్లి దగ్గరుండాలని అనుకుంది. ఆ మాటే రాజయ్యతో అంటే, "నీ కేమైనా పిచ్చేటే, అంత దూర వెళ్లాలంటే సార్జీలకి ఎంతుండాలో తెల్సా?" అన్నాడు. "ఆ అడివిలో ఏటుంటాది? ఇక్కడే మంచి ఆడ డాకటేరు కాడ పురుడు పోయిత్తాను."

అది జరిగే పని కాదని గంగ కెప్పుడో అర్థమైంది. రాజయ్య సంపాదించిన కొద్దో గొప్పో వాడి తాగుడుకే ఖర్చైపోతోంది. గంగ రెక్కలు ముక్కలు చేసుకుని ఆ కుటుంబాన్ని పోషించాల్సి వస్తోంది. వేణ్ణీళ్లకి చన్నీళ్లుగా వుంటాయని ముక్కుపచ్చలారని కుర్రాళ్ళకి కూడా పావలో అర్థో సంపాదించడం నేర్పింది. గంగకి ఏడో నెల వచ్చేక రాజయ్య అర్థాంతరంగా కన్ను మూసేడు. అప్పుడు కూడా గంగ బెంబేలెత్తిపోలేదు. చుట్టూ మనుషులుంటే చాలు, ఆమె రెక్కలే ఆమెకి ధైర్యం. బోడమ్మకీ, పిల్లలకీ గంగే ధైర్యం చెప్పింది. ఆ గుడిసెల్లోని నలుగురూ కలిసి శవాన్ని మోసుకుపోయేక పది గుడిసెల్లోంచీ పది గుప్పిళ్ల బియ్యం అడిగి తెచ్చి, అన్నం వండి ఆ తల్లీ పిల్లల చేత తినిపించింది.

అలాంటి గంగకీ రోజు ఈ ఒంటరితనం బెంబేలెత్తిస్తోంది. నాలుగేళ్ల నించి ఇక్కడే బతికినా, ఊరేంటో పరాయిదిగా అన్పిస్తోంది. తెలిసున్న ముఖం ఒక్కటీ లేనట్టు అన్పిస్తోంది.

క్రమంగా చినుకులు పెద్దవై వాన జోరందుకుంది.

కళా కేంద్రం ముందు వెంకటేశ్వరాలయం కడుతున్న కూలీలంతా వరండాలలోకి పరుగెత్తుకొచ్చి పడ్డారు. అలా మొదలైన వాన సాయంకాలం వరకూ ఎడతెరిపి లేకుండా కురుస్తూనే వుంది.

వాళ్ళందర్నీ చూస్తే గంగకి ఏదో ఆశ కలిగింది. మేస్త్రీ దగ్గరకెళ్లి రేపట్నుంచి తనకి కూడా పని ఇప్పించమని అడిగింది.

మేస్త్రీ ఆమెని ఎగాదిగా చూసి "నువ్వు చేసే పని కాదులే ఇది, ఎల్లెల్లు" అన్నాడు. "అయినా పొద్దున్న రేడియోలో సెప్పేరు, ఈ వాన ఇప్పుడప్పుడే తెరిపియ్యదంట."

ఆ వానలో తడుస్తూనే క్రమంగా అందరూ వెళ్ళిపోయేరు. గంగ మళ్ళీ ఒంటరిగా మిగిలిపోయింది.

నిన్న బజార్లోనూ ఇదే వరస. తమ బరువులు మొయ్యలేకపోతూందని, త్వరగా నడవలేకపోతూందని షావుకారు కేకలు పెట్టేడు. "మా ప్రేణం తియ్యకపోతే ఆ బరువేదో దింపుకున్నాక రారాదూ" అన్నాడు తన

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

కదుపు కేసి చూస్తూ.

"ఆ సచ్చినోడలా వాగితే మాత్రం నాకిది బరువెలా అవుతాది? నా బిడ్డ, నా రగతంలో రగతం, ఇక మీద ఈడే కదా నాకు తోడూ నీడా" అనుకుంది ఆప్యాయంగా కదుపు వేపు చూసుకుంటూ. "ఆడికి అన్నం తినే వయసొచ్చేక గాజు పళ్లెంలోనే అన్నం తినిపించాలి" అనుకుంది గర్వంగా. అందర్లాగా ఆడు సత్తుగిన్నెల్లో తినడు.

టైమెంతైందోగాని మబ్బులు దట్టంగా మూసేసి పొద్దుగూకినట్టే వుంది. కదుపులో కదిలికదిలి ఇక ఓపిక లేనట్టు ఆగిపోయింది బిడ్డ. పొత్తికదుపు బిగబట్టుకు పోయినట్టుంది. ఆకలికి శోషొచ్చినట్టైపోతోంది. గంగని తన కదుపులో ఆకలి కన్నా, బిడ్డ కదుపులో ఆకలి ఎక్కువ బాధిస్తోంది. ఏ వేడి గంజో పోసి బిడ్డని లేపాలి. కదుపులో బిడ్డ కదలకపోతే ప్రమాదం అని బుచ్చిది చెప్పిన మాట గుర్తుకొచ్చి వణికిపోయింది.

ఎవరైనా అడిగితే గుప్పెడన్నం పెడతారేమో అన్పించింది. కాని, దరిదాపుల్లో ఎక్కడా ఇళ్ళే లేవు.

పగలంతా పడుకున్న అప్సరా లాడ్జి గదులు రాత్రికి లైట్లతో సింగారించుకుంటున్నాయి. ఆ పక్క హోటల్లోంచి వస్తున్న కమ్మని పోపుల పరిమళానికి గంగకి నోట్లో నీళ్లూరిపోతున్నాయి.

ఇంకా పొద్దుగూకితే వాచ్‌మేన్ అక్కడుండనియ్యడని గంగకి తెలుసు. హోరున కురుస్తున్న ఆ వర్షంలో మూటని పదిలంగా గుండెకి హత్తుకుని మెట్లు దిగింది గంగ. కళా కేంద్రం గేటు ముందుండే తోపుడు బళ్ళ దుకాణాల జాడే లేదు. ఎటుపోవాలో దిక్కుతోచక తడుస్తూ గేటు ముందు ఆగిపోయింది. పాత పోలీస్ క్వార్టర్స్ వైపు వెళ్ళి కాస్త గంజి అడుక్కుందామని నిశ్చయించుకుంది. అగ్నిపూల చెట్ల కింది కొచ్చాక కాలు కదలక అలా నిలబడిపోయింది.

వీథుల్లో ఎక్కడా జనసంచారం లేదు. నిన్న ఈ సమయానికి అక్కడ జన నివాసాలుండేవి అంటే ఎవరూ నమ్మలేరు. అప్పుడే పశువుల సంత ముగిసి నటుట్టుంది ఆ ప్రాంత మంతా. వదిలేసిన చింకి పాతలూ, పగిలిన కుండపెంకులూ, పెంటపోగుల్తో వానకి తడిసి పరమ రొచ్చుగా వుంది. గుడ్డి తాత ఇటికల పొయ్యి మాత్రం నదిలో సగం మునిగి ధ్యానంలో వున్న యోగిలా వుంది,

గంగ మనసు మార్చుకుని కుడి పక్కకి తిరిగి స్టేషన్లోకి నడిచింది. అడుగు తీసి అడుగేస్తూంటే కుడి డొక్కలో కలుక్కుమంటోంది. అది ఆకలి నొప్పని ఆమెకి తెలుసు. పస్తులుండడం ఆమెకి కొత్తేమీ కాదు. కాని, ఈ రోజు ఈ ఆకలి దుర్భరంగా వుంది. బిడ్డ కదలని స్పృహ ఆమె గుండెని నొక్కేస్తోంది. కొత్తగా కట్టిన స్టేషను ఆవరణలోకి అడుగుపెడుతూనే ఒక నిర్ణయానికి వచ్చి, ఆమె కళ్లు గన్నిగాడి కోసం వెతికాయి. ఈ చివరి నుంచి ఆ చివరి దాకా కాళ్లీడ్చుకుంటూ తిరిగింది గంగ. 'ఒకవేళ అవతల ప్లాట్‌ఫాం మీదున్నాడేమో' అనుకుంది. బ్రిడ్జి ఎక్కి దిగే ధైర్యం చెయ్యలేకపోయింది.

ఏదో బండొస్తున్నట్టుంది. స్టేషన్లో అలజడి పెరిగింది.

ఆ జనం మధ్య పిచ్చిదాన్లా తిరుగుతోంది గంగ. మధ్య మధ్య క్రీనీడలో నిలబడి కదుపు తడిమి చూసుకుంటోంది. ఉ హు, బిడ్డలో చలనం లేదు. ఆమె అమ్మ మనసు తల్లడిల్లిపోతోంది. ఇంకా నేల మీద పడని, రూపం కూడా తెలీని బిడ్డ కోసం ఆమె హృదయం ఒకటే కొట్టుకుంటోంది. ఇప్పుడింక వాణ్ణి బతికించుకోడానికి ఏం చెయ్యడానికైనా సిద్ధమే.

టీ తాగే డబ్బులైనా దొరుకుతాయేమోనని ప్రయాణీకులు ఒకళ్లిద్దరు దగ్గిర చెయ్యి చాపబోయింది. అలవాటు లేని పని — ఆమె చెయ్యి వెనక్కి వచ్చేస్తోంది. బండొచ్చే తొందర్లో ఎవరూ గంగని పట్టించుకోవడం లేదు.

ఒకళ్లిద్దరు పోర్టర్లని గన్నిగాడి కోసం అడిగి చూసింది. పొద్దుపోయేక ఆణ్ణెవరూ చూళ్లేదన్నారు. అవ్వోరం గాడైతే "ఏంటి సంగతి" అని కన్నుకొట్టి వెకిలిగా నవ్వేడు. దిక్కుతోచక గుడ్ల నీళ్లు కుక్కుకుంటూ క్రీనీడలో అలాగే చతికిలబడిపోయింది. వాన కొంత తెరిపిచ్చింది. 'తొమ్మిదో పదో అయ్యుంటాది' అనుకుంది గంగ. పాత బ్రిడ్జి మీంచి రోకలి బండలాగా పాక్కుంటూ వచ్చిన బండి కీచుమని గోలపెడుతూ స్టేషన్లో ఆగింది. ఆగిన బండిలోంచి రెండు సూట్‌కేసులు నెత్తిన పెట్టుకుని దిగేడు గన్నిగాడు. "ఇంటి కెళ్లి కూడు తిని వస్తన్నాడన్న మాట" అనుకుంది. సత్తుకంచంలో తెల్లగా మల్లెపూలలాగా విచ్చుకున్న అన్నం కళ్ల ముందు కదిలింది గంగకి. ఆకలి రెట్టింపయింది.

బండెళ్లిపోయేక స్థిమితంగా గంగ కూచున్న చీకటి స్తంభం దగ్గిరి కొచ్చేడు గన్నిగాడు. "సందేల నించి నన్నడుగుతున్నావంట, ఏంటి సంగతి?" అన్నాడు కళ్లు చికిలించి చూస్తూ. వెలుగులో నిలబడి వున్న వాడి కళ్లు ఎర్ర జీరల్తో చిరతపులి కళ్లలా మెరుస్తున్నాయి. వాడు తాగి వున్నాడని అర్థమైంది గంగకి.

"ఏటి, సెప్పవేటి" అన్నాడు వాడు విసుగ్గా. పొద్దున్న గంగ చూపిన ఛీత్కారపు చూపింకా మర్చిపోలేదు వాడు.

వీలైనంత అణకువని గొంతులోకి తెచ్చుకుని జాలిగా అంది గంగ — "ఏం లేదూ... ఆకలి... ఆకలేత్తా వుంది. ఒక బన్నూ, కాసిన్ని టీ నీళ్లూ కొనిపెడతావేమోనని..." గంగ పరిస్థితి అర్థమైంది గన్నిగాడికి. ఆకలెలాంటిదో వాడికి బాగా తెలుసు.

"సరే, కొనిపెడతా నమకో, నా కేటి లాబం?" అడిగేడు కసిగా.

గంగ ఒక్క నిమిషం మౌనంగా వుంది. తర్వాత తెగించిన దానిలా అంది "నీకేం కావాలో తీసుకో..." ఆమె స్వరం కీచుగా జీరబోయింది.

"అనితే నాతోరా" ఎగిరి గంతేసినంత హుషారుగా అన్నాడు గన్నిగాడు.

లేచి వాడి వెనకే నడిచింది గంగ. ఇంకా తవ్వుతూ తవ్వుతూ వున్న అండర్‌గ్రౌండు గుయ్యారంలోకి వాడు దారి తియ్యడం చూసి ఆగిపోయింది.

"ఉప్పుడు కాదు... ముందు నాకు తిండి కావాల."

గన్నిగాడు వెనక్కి తిరిగి నోట్లో బీడిని తుపుక్కున ఉమ్మేసేడు.

"అదేం కుదర్దు. ముందునా అవసరం తీరేకే నీ ఆకలి తీరతాది" నిర్ణయించుకో అన్నట్టు నిర్లక్ష్యంగా చూసేడు. వాడి గొంతులోని పట్టుదల అర్థమైంది గంగకి.

నిస్సహాయంగా కదిలింది. మోకాళ్ల లోతున్న వాన నీళ్లలోంచి చీకట్లోకి నడిచి నాలుగేళ్లుగా పెంచుకున్న కసితో ఒక్కసారిగా పులిలా మీదికి లంఘించిన గన్నిగాడి బరువుకి మొదలు నరికిన చెట్టులా వెల్లకిలా పడిపోయింది గంగ.

వెన్నులో ఫటెల్లుమని ఏదో చిట్లినట్లైంది.

పదిలంగా గుండెలకి హత్తుకున్న గాజుపళ్లెం విరిగి వెయ్యి ముక్కలైంది.

*

ఆ ఈగా... ఈ ఈగా ఒకటి కాదు

ఒకసారి చార్లీ చాప్లిన్‌ని అతని మిత్రుడు అల్పాహార విందుకి ఆహ్వానించాడు. ఆ ప్రపంచ ప్రసిద్ధ హాస్య నటుడికి స్వయంగా వడ్డిస్తూ ఆ అదృష్టానికి ఆ మిత్రుడు ఆనందిస్తున్నాడు.

ఇంతలో ఒక ఈగ చాప్లిన్ ముందున్న ప్లేట్‌లోని పదార్థాల మీద వాలడానికి ప్రయత్నించడం మొదలు పెట్టింది. చాప్లిన్ దానిని వాలకుండా చేతితో తరమడం మొదలు పెట్టాడు. ఆ ఈగ చాప్లిన్‌ని తెగ విసిగించడం ప్రారంభిస్తే చాప్లిన్ ఇక దానిని చంపడమే మంచిదనుకుని ఎంతో ప్రయత్నించాడు. అయినా అది చాప్లిన్‌కి అందలేదు. కొంతసేపు కనిపించని ఈగ టేబిల్ మీద చాప్లిన్‌కి దగ్గరగా వాలింది. చాప్లిన్ ఈగని ఈసారి సులభంగా చంపవచ్చు. కాని చంపలేదు.

ఈ 'ప్రహసనం' అంతా గమనిస్తున్న చాప్లిన్ మిత్రుడు, చాప్లిన్‌ని "ఇందాకా ఈగని చంపడానికి ప్రయత్నించినా అది దొరకలేదు. ఇప్పుడు అది దొరికినా మీరు చంపడం లేదు. ఏమిటి" అడిగాడు.

దానికి హాస్యానికి తొలి భాష్యం చెప్పిన చార్లీ చాప్లిన్ "ఆ ఈగా ఈ ఈగా ఒకటి కాదు" అన్నాడు సీరియస్‌గా!

– బంటి